

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అనుబంధం

**"విందూ** ఒరే విందా" వెనకనించి వినిపించిన పిలుపుకి అరవింద్ ఓ క్షణం `తననేనా?` అనుకుని వెనక్కి చూసాడు.

చేతిలో చిన్న ప్లాస్టిక్ కవర్‌తో హరిత పరుగులాంటి నడకతో వస్తోంది.

"హరీ! నువ్వేమిటే ఇక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నేనిక్కడే ఆ పక్కనే మనిల్లు. నువ్వేమిటి ఇక్కడ?" హరిత ఆయాసంగా అడిగింది.

"చిన్న పనుండి వచ్చాను" అరవింద్ ఇబ్బందిగా చెప్పాడు.

"ఎక్కడ దిగావు?"

"బద్రీ ఇంట్లో" అదే ఇబ్బందితో చెప్పాడు.

"సరే. పద. నల్లగేటు కనిపిస్తోందే అదే మనిల్లు"

"ఇప్పుడా?"

"ఇప్పుడే అదృష్టం బావుండి, బద్దకించినా పేరంటానికి వెళ్ళాను. లేకపోతే నువ్వు వెళ్ళిపోయేవాడివి" హరిత బాధగా చెప్పింది.

అరవింద్ తప్పనిసరైనట్లుగా అయిష్టంగా ఆమె వెనక అడుగులు వేసాడు.

"వదినెలా ఉందిరా?" హరిత అడిగింది.

"బానేవుంది."

హరిత ఇంకేం మాట్లాడలేదు. గేటు తీసి, అరవింద్ లోపలికి వచ్చాక మళ్ళీ గేటువేసి, ఇంటి తాళం తీసింది. లోపల ఆడుకుంటున్న ఇద్దరు పిల్లలు `అమ్మా` అంటూ పరిగెత్తుకొచ్చారు.

"ఇదేంటి? వీళ్ళని తాళం పెట్టి వెళ్ళావా?" అరవింద్ ఆశ్చర్యంగా అడిగాడు.

"మరేం చేయను? పదినిమిషాల్లో వచ్చాసాలే. నువ్వు నా పిల్లల్ని చూడలేదుగా విందూ. ఇది అరవింద, వీడు హరీష్"

అరవింద్ ఒక్క క్షణం చలించాడు. హరీష్ అచ్చం చిన్నప్పటి తనలా ఉన్నాడు. తనది అప్పటి ఫోటో చూపిస్తే వాడే అనుకుంటారు. అరవింద మేనత్తలా వుంది.

"మన పేర్లు పెట్టావా?" సోఫాలో కూర్చుంటూ అడిగాడు.

"అవున్రా. అమ్మా నాన్నా పోయాక నువ్వు మళ్ళీ నా గురించి ఆలోచించావా? ఉన్నది మనిద్దరం. ఇద్దరం ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు బతుకుతున్నాం" హరిత దుఃఖంగా చెప్పింది.

అరవింద్ ఇబ్బందిగా కదిలి చుట్టూ చూసాడు. తన భార్య చెప్పినట్లు వీళ్ళు దరిద్రంలో బతకడం లేదు. ఇల్లు చూస్తే ఎగువ మధ్యతరగతి జీవితంలా వుంది. జమునకి ఎందుకో హరిత అంటే అంత కోపం అనుకున్నాడు.

హరిత మంచినీళ్ళగ్లాస్, కాఫీ కప్పు తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"ఇవాల్టికి ఇక్కడే ఉండరా. రేపు లేచి పనులు చూసుకుని వెళ్దువుగాని. మీ బావమరిదికి ఫోన్ చేసి చెప్పు" చెప్పింది.

అరవింద్‌కి ఏం చెప్పాలో తెలియలేదు.

"ఐనా స్వంత చెల్లెల్ని నేనుండగా నువ్వు మీ ఆవిడ పిన్నికొడుకు ఇంట్లో దిగడం ఏంట్రా? తోడబుట్టినవాడివి. నా కష్టసుఖాలు ఏవైనా పట్టించుకున్నావా? పెళ్ళవగానే పరాయివాడివైపోయావు" హరిత ఉక్రోషంగా చెప్పింది.

దూరంగా నుంచుని చూస్తున్న పిల్లల్ని దగ్గరకి పిలిచి చెప్పింది.

"హరీ, విందా వీడు మా అన్నయ్య. మేమిద్దరం మీకులా అన్నా చెల్లెళ్ళం. మీకు మామయ్యవుతాడు."

"మామయ్య మనింటికి ఎప్పుడూ రాలేదేంటమ్మా?" అరవింద గుసగుసగా అడిగింది.

"మామయ్య పెద్ద కింగ్‌లాంటివాడు. మరి నేను పూర్ కదా. అందుకని మనింటికి రాలేదు. ఏరా హరీష్ పెద్దయ్యాక నువ్వూ అంతే చేస్తావా?" అడిగింది.

"ఛీఛీ! నా సిస్టర్ని కూడా నా పేలస్‌లోనే ఉంచుకుంటా" వాడు చెల్లెలి చుట్టూ చెయ్యివేసి చెప్పాడు.

అరవింద్ మొహం ఎర్రబడింది. అదే సమయంలో తలుపు తీసుకుని హరిత భర్త త్రిమూర్తి లోపలికి వచ్చాడు.

"ఎవరదీ? బావా? ఒరే విందూ" ఒక్కుదుటున వచ్చి అతను అరవింద్‌ని కౌగిలించుకున్నాడు.

అప్రయత్నంగా అరవింద్ కళ్ళు చెమర్చాయి. త్రిమూర్తి వాళ్ళ మేనత్తకొడుకు. చిన్నతనంలో దాదాపు తన వయసే అయిన త్రిమూర్తి, తను ఎన్ని ఆటలు ఆడేవాళ్ళో, ఎంత అల్లరి చేసేవాళ్ళో.

"హరితా వీడిని ఎక్కడనించి పట్టుకొచ్చావు? వీడంతట వీడు మనిల్లు వెదుక్కుంటూ రాడు. అసలు మనం ఎక్కడున్నామో కూడా వీడికి తెలీదుగా?" త్రిమూర్తి భార్యని అడిగాడు.

"మనింటి పక్కన కార్నర్‌లో ఏదో ఆఫీస్‌లోంచి బయటకి వస్తూంటే చూసాను. ఠక్కున గుర్తుపట్టేసా. పదేళ్ళు కాలా చూసి? అవును. అమ్మ పోయి ఈ సంక్రాంతికి పదేళ్ళు నిండుతాయి" హరిత చెప్పింది.

"సరే వీడ్ని ఇవాళ వదిలేది లేదు. నువ్వు వంటచెయ్యి. మేం కబుర్లు చెప్పుకుంటాం" త్రిమూర్తి అరవింద్‌ని డాబామీదకి తీసుకెళ్ళాడు.

అరవింద్ జేబులోంచి సెల్‌ఫోన్ తీసి, 'బాల్యమిత్రుడు కనిపించాడని, ఈ రాత్రి అతనితో గడిపి రేపు ఉదయం ఇంటికి వస్తానని' బద్రీకి మెసేజ్ చేసాడు.

డాబామీద నాలుగు పేము కుర్చీలు వేసున్నాయి. మధ్యలో మార్బుల్ టాప్ ఉన్న టీపాయ్ వుంది. చంద్రుడు వెన్నెలలు విరజిమ్ముతున్నాడు.

"చెప్పరా విందూ. ఎలా వున్నావు? పిల్లలెంత మంది? వైజాగ్‌లోనే ఉంటున్నావా?" త్రిమూర్తి ఆప్యాయంగా అడిగాడు.

"బానేవున్నాను వైజాగ్‌లోనే. ఒక పాప. ఇక చాలనుకున్నాం జాబ్ మానేసి కాంట్రాక్ట్స్ చేస్తున్నాను. నువ్వేం చేస్తున్నావు?" అరవింద్ అడిగాడు.

"నా పెళ్ళప్పుడు జూనియర్ కాలేజ్‌లో క్లర్క్‌గా పనిచేసేవాడిని కదా. తర్వాత గ్రూప్స్ రాసాను. రెవెన్యూలో ఉన్నాను. ఈ ఊరొచ్చి ఐదేళ్ళయింది. హరిత నిన్ను బాగా మిస్సవుతుందిరా."

అరవింద్ ఏమీ మాట్లాడలేదు. అతని భార్య జమున తన పిన్నికొడుకు బద్రీ పెళ్ళి హరితతో చేయాలని చాలా అనుకుంది. తనే వాళ్ళతో అన్నీ మాట్లాడేసి, చివరికి ఆ విషయం అత్తగారికి చెప్పింది.

అరవింద్ తల్లి దానికి ఒప్పుకోలేదు. హరిత పుట్టినప్పుడే త్రిమూర్తికి పెళ్ళాం పుట్టిందని ఆడపడుచు చెప్పిందని, భర్త లేకపోయినా ఆడపడుచు తనకి అండగా ఉంది కాబట్టి త్రిమూర్తే తన అల్లుడని చెప్పింది.

అది జమునకి అవమానం అయింది. ఆ తర్వాత ఆమె భర్తని తల్లిగారింటికి వెళ్ళకుండా కట్టడి చేసింది. హరిత పెళ్ళి కుదిరాక 'వచ్చి కన్యాదానం చేయమని, తండ్రిలేని పిల్లని' తల్లి ప్రాధేయపడుతూ ఉత్తరం రాసినా జమున ఒప్పుకోలేదు.

చివరికి తల్లిపోయాక వెళ్ళాడు. ఆ పదిరోజులు ఉండి, కర్మకాండలు చేసి వెళ్ళిన అరవింద్ తన వాళ్ళని చూడడం మళ్ళీ ఇదే మొదటిసారి.

కాంట్రాక్టర్‌గా డబ్బు సంపాదన పెరిగాక జమున భయంతో భర్తచేత కూతురిమీద ఒట్టేయించుకుంది- ఆ దరిద్రపు గుంపుని చూడను - కలవను - అని.

"అదేమిటో అరవిందూ. మా అమ్మకూడా పోయేప్పుడు 'ఒరే విందూ వచ్చాడా? వాడ్ని పిలవండిరా' అని కలవరించేది అత్తయ్యకూడా అంతేగా. పక్కనే ఉన్న నన్ను పట్టించుకోకుండా అలవైకుంఠపురంలో ఉన్న నిన్ను చూడాలంటే, కుచేలుడ్ని నావల్లేమవుతుందిరా? అప్పటికీ మీ లాండ్‌లైన్‌కి నాలుగైదుసార్లు ఫోన్ చేసాను. నువ్వు హీరోయిన్‌లా ఎప్పుడూ బాత్రూంలోనే ఉంటావు. కొన్నాళ్ళ తర్వాత ఫోన్ చేస్తే లేండ్ లైన్ సరెండర్ చేసారని చెప్పారు. వైజాగ్‌లో ఉన్న తెలిసిన వాళ్ళకి నీ అడ్రస్ చెప్పి, వెళ్ళి కలవమంటే నువ్వు బీచ్ రోడ్‌లో పెద్ద ఇల్లు కట్టుకుని అందులోకి మారావని తెలిసింది. అడ్రస్ ఎవరూ చెప్పలేదు. అమ్మ వెళ్ళిపోయింది. చివరికి నేనూ హరిత మిగిలాం" త్రిమూర్తి నిట్టూర్చాడు.

వెన్నెలని చూస్తూ త్రిమూర్తి చటుక్కున అడిగాడు.

"విందూ గుర్తుందా? రాత్రుళ్ళు మనం నీడతొక్కే ఆట ఆడేవాళ్ళం. ఒకసారి నువ్వు నెడితే హరిత బురదగుంటలో పడింది. భయపడి ఆ రాత్రి నువ్వు మా ఇంట్లో, నేను మీ ఇంట్లో పడుకున్నాం."

ఆ సంఘటన గుర్తొచ్చి అరవింద్‌కి నవ్వొచ్చింది.

"నాన్నా అమ్మకిందకి రమ్మంటోంది" హరీష్ వచ్చి పిలిచాడు.

"పదరా తినేసి కబుర్లు చెప్పుకుందాం" త్రిమూర్తి లేచాడు.

భోజనాల దగ్గర హరిత తమ బంధువులందరి గురించి చెప్పింది.

"అందరితో మాకు మంచి సంబంధాలే ఉన్నాయిరా. ఏ ఫంక్షన్‌కి పిలిచినా వీలైనంత వరకు వెళ్తాం. ఇద్దరం అనాధలుగా మిగిలాం కదా. నలుగురితో కలిసుంటే బావుంటుంది. అంతా నీ గురించి అడుగుతారు. నువ్వు బిజీ అని చెప్తాం. ఓసారి మీ బద్రీ ఎగ్జిబిషన్‌లో కనిపించాడు. నీ ఫోన్ నంబర్ చెప్పమని అడిగితే తెలీదన్నాడు." హరిత చేదుగా నవ్వింది.

భోజనాలయ్యాక మళ్ళీ కబుర్లలో పడ్డారు. త్రిమూర్తి చెప్పిన చాలా బాల్య సంఘటనలు అరవింద్‌కి గుర్తులేవు. గుర్తున్నవి గత జన్మలో జరిగినట్లుగా అనిపించింది. వీళ్ళు జ్ఞాపకాలతోనే బతుకుతున్నారా అనుకున్నాడు.

పడకమీదకి చేరాక ఫోన్ చూసుకుంటే జమున నించి మెసేజ్. 'నాకు తెలీని బాల్యమిత్రుడు ఎవరు మీకు? ఆ దరిద్రపు మూక ఎవరైనా తగిలారా?'

ఓ క్షణం కోపం వచ్చింది. కాని తమాయించుకుని సమాధానం ఇచ్చాడు. 'ఐ.ఐ.టిలో నా ఫ్రెండ్ వెంకట్రావు. యు.ఎస్‌లో సెటిల్ అయ్యాడు. మల్టీ మిలియనీర్. వైజాగ్‌లో ఏదో విల్లా కొనాలని ప్లానట. ఆ విషయం మాట్లాడటానికి వచ్చా."

తక్షణం రిప్లైగా ఓ స్మైలీ బొమ్మ వచ్చింది.

చిన్నప్పటి ఆలోచనలతో అరవింద్‌కి ఆ రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు.

"విందూ! జాగింగ్‌కి వస్తావా?" మర్నాడు ఉదయం త్రిమూర్తి కొత్త టూత్ బ్రష్ ఇస్తూ అడిగాడు.

"లేదు. నేను వెళ్ళాలి. అర్జెంటు పనుంది" చెప్పాడు.

"బ్రేక్ ఫాస్ట్ తిని కాఫీ తాగి డ్రెస్ చేసుకుని అరవింద్ చెల్లెలివంక చూసి చెప్పాడు "వస్తానమ్మా."

"నీ ఇంటికి పిలిచే ధైర్యం నీకు లేదురా. కాని మన ఇంటికి మాత్రం వస్తూండు. బావ, నేను నీకోసం ఎదురు చూస్తూంటాం." హరిత కళ్ళు చెమర్చాయి.

"అలాగే" అరవింద్ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత అరవింద్ ఆ ఊరికి, హరిత ఇంటి పక్కనున్న ఆఫీస్‌కి అనేకసార్లు వెళ్ళాడు. కానీ హరిత ఇంటికి మాత్రం ఎప్పుడూ వెళ్ళలేదు.

అతనికా విషయం జ్ఞాపకం కూడా లేదు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments